# ముగిసిన ఇంటర్ పరీక్షలు

ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేస్తామన్న విద్యార్థినులు



## విద్యార్థినుల ఆనంద కేరింతలు

సిద్దిపేట బాలికల జూనియర్ కళాశాలలో సందడి








**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో రెండు వేల ఇరవై ఐదు - ఇరవై ఆరు విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం పరీక్షలు విజయవంతంగా ముగిశాయి. పరీక్షలు పూర్తి కావడంతో విద్యార్థినులు ఆనంద కేరింతలతో పరీక్షా హాల్ల నుంచి బయటకు వస్తూ తమ సంతోషాన్ని పంచుకున్నారు.

### ఒత్తిడి నుంచి విముక్తి.. ఆనందంలో చిన్నారులు

గత కొన్ని రోజులుగా పరీక్షల ఒత్తిడితో సతమతమైన విద్యార్థినులు, నేడు చివరి పరీక్ష ముగియడంతో ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. సహపాఠులతో కలిసి నవ్వులు పూయిస్తూ, భవిష్యత్తు గురించి ఆశావహంగా మాట్లాడుకుంటూ కళాశాల ప్రాంగణంలో సందడి చేశారు. ఆ ప్రాంగణం అంతా విద్యార్థినుల కేరింతలతో కళకళలాడింది.

### లక్ష్యం దిశగా ముందడుగు

తమకు పరీక్షల్లో మంచి ఫలితాలు వస్తాయని విద్యార్థినులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఉన్నత విద్యను అభ్యసించి డాక్టర్లు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు వంటి గొప్ప స్థాయికి చేరుకోవాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదిగి, తల్లిదండ్రులకు గౌరవం తీసుకురావాలని సంకల్పం వ్యక్తం చేశారు.

### ఉపాధ్యాయుల అభినందనలు

ఈ సందర్భంగా కళాశాల ఉపాధ్యాయులు విద్యార్థినులకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరింత కృషి చేసి విజయాలు సాధించాలని సూచించారు. పరీక్షలు ప్రశాంతంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించబడినట్లు కళాశాల వర్గాలు తెలిపాయి. విద్యార్థినులలో భవిష్యత్తుపై నూతన ఆశలు, లక్ష్యాలతో ముందుకు సాగాలనే ఉత్సాహం స్పష్టంగా కనిపించింది.



# ఘనంగా ఆర్కే హై స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

## ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, కొక్కిరాల సురేఖ

- సాంస్కృతిక కార్యక్రమాల్లో అదరగొట్టిన విద్యార్థులు

**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఆర్కే హై స్కూల్ మొదటి వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు హాజరయ్యారు. అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను అధికారికంగా ప్రారంభించారు.





### విద్యే భవిష్యత్తుకు బలమైన పునాది

ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ప్రతిభ కనబరచాలని సూచించారు. విద్యే భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొన్నారు. క్రమశిక్షణ, కృషి ఉంటేనే విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు. పాఠశాలలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే వేదికలుగా నిలవాలని ఆకాంక్షించారు.

### లక్ష్యసాధన దిశగా ముందడుగు

విద్యార్థులు తమ గురువుల మార్గదర్శకత్వంలో లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని మాజీ డీసీసీ అధ్యక్షురాలు సురేఖ ప్రేమ్ సాగర్ రావు సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను అతిథులు ఆసక్తిగా వీక్షించి అభినందించారు. పాఠశాల యాజమాన్యానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, కాంగ్రెస్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ.. ముస్లింలకు రంజాన్ తోఫా

**పట్టాలు అందజేసిన ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు**

**గత ప్రభుత్వం పేదలను మోసం చేసిందని విమర్శ**



**జుక్కల్, మార్చి 13 (జనం పవర్):**

కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట మాట్లాడుతూ గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చి ఆశలు కల్పించిందని మండిపడ్డారు. జుక్కల్ నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్రూం ఇల్లు కూడా ఇవ్వకుండా పేదలను మోసం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

### అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు

ప్రస్తుత ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని నిజంగా అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం చేసే దిశగా పనిచేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిజంగా ఇల్లు అవసరమైన పేద కుటుంబాలకు ఇళ్లు నిర్మించి అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇల్లు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

### ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పేద ముస్లిం కుటుంబాలు పండుగను ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంజాన్ తోఫా అందజేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. అందులో భాగంగా ఈరోజు పేద ముస్లిం కుటుంబాలకు ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

**పదో తరగతి పరీక్షలపై తాజా మాజీ ఎంపీపీ ఆకాంక్ష**

**లక్ష్య సాధన దిశగా సాగాలన్న లింగాల నిర్మల లక్ష్మణ్**



**బెజ్జంకి, మార్చి 13 (జనం పవర్):**

పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థిని విద్యార్థులు పరీక్షలను బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని బెజ్జంకి మండలం తాజా మాజీ ఎంపీపీ లింగాల నిర్మల లక్ష్మణ్ ఆకాంక్షించారు. పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థిని విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనపర్చి తమ లక్ష్యాన్ని మార్గ నిర్దేశం చేసుకోవాలని సూచించారు. మంచి భవిష్యత్తు నిర్మించుకోవడానికి ఈ పదవ తరగతి పరీక్షలు ఒక ముఖ్యమైన మైలురాయి వంటివి అని ఆమె పేర్కొన్నారు. పదవ తరగతి పరీక్ష ఫలితాలు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాది రాయి వంటివని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా శనివారం నుండి పరీక్షలు రాసే పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉత్తమ ప్రతిభను కనపరచాలని కోరారు. తద్వారా పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు తన ఆశీస్సులు అందజేశారు.

# పలు వివాహ శుభకార్యాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే షిండే

**బిచ్కుందలో ఘనంగా వార్డు సభ్యుడు లక్ష్మణ్ వివాహం**

**వధూవరులను ఆశీర్వదించిన హన్మంత్ షిండే**



**బిచ్కుంద, మార్చి 13 (జనం పవర్):**

కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం కథగావ్ గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ మూడో వార్డు సభ్యులు కొంగలవార్ లక్ష్మణ్ వివాహ వేడుకలు బిచ్కుందలోని బండాయప్ప ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ పెళ్లి శుభ సందర్భంలో జుక్కల్ మాజీ శాసనసభ్యులు హన్మంత్ షిండే పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం ఆనందం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో నిండాలని హృదయపూర్వకంగా ఆశీర్వదించారు.

**రెండు కుటుంబాల ఆనందానికి ఆరంభం**

వివాహం అనేది రెండు హృదయాల కలయిక మాత్రమే కాదని, రెండు కుటుంబాల ఆనందానికి అది ఒక గొప్ప ఆరంభమని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొంగల శంకర్, వెంకటరావు దేశాయ్ పాల్గొన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాల్చార్ రాజు, మాజీ కథగాం సర్పంచ్ హనుమాన్లు, గణపతి రెడ్డి, గ్రామ పెద్దలు, స్నేహితులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# విశ్రాంత ఉద్యోగులకు కనీస పెన్షన్ 7,500 రూపాయలకు పెంచాలి

**ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా**

**కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిన జాతీయ సంఘర్షణ కమిటీ**




**సంగారెడ్డి, మార్చి 13 (జనం పవర్):**

ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులకు కనీస పెన్షన్‌ను ఏడు వేల ఐదు వందల రూపాయలకు పెంచాలని జాతీయ సంఘర్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధేశ్వర్ సులుగంటి డిమాండ్ చేశారు. వృద్ధాప్యంలో విశ్రాంత ఉద్యోగులకు ఆర్థిక భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**ఆందోళనలు కొనసాగిస్తాం**

ఈ ధర్నా కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు అశోక్ రావత్, ప్రధాన కార్యదర్శి వీరభద్ర సింగ్ రజావత్, ప్రధాన సమన్వయకర్త రమాకాంత్ నర్డండ్ పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు లక్ష్మి కరవదే, ప్రధాన కార్యదర్శి సుబ్బయ్య ప్రసంగిస్తూ కనీస పెన్షన్ పెంపు జరిగే వరకు ధర్నాలు, ఆందోళనలు నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పలువురు పార్లమెంట్ సభ్యులు ఈ అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేస్తూ, తదుపరి కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల ప్రతినిధులతో పాటు మెదక్ జిల్లా తరఫున నరసింహులు, కాశి రాములు, పాండురంగ, విజయభాస్కర్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# జుక్కల్ లో ప్రగతి ప్రణాళిక వేడుకలు

- పాల్గొన్న ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు
- గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలి



**జుక్కల్, మార్చి 13 (జనం పవర్):**

కామారెడ్డి జిల్లా జుక్కల్ మండల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన తొంభై తొమ్మిది రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు సక్రమంగా అమలవ్వాలంటే సర్పంచుల నుండి మండల నాయకుల వరకు ప్రతి ఒక్కరూ స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**సంక్షేమ రంగానికి బడ్జెట్ లో ప్రాధాన్యత**

రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో పంచాయతీలు, మున్సిపాలిటీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ రంగాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం జుక్కల్ మండల కేంద్రంతో పాటు ఎడిగి గ్రామంలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనులు నాణ్యతగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

**సీసీ రోడ్డు పనులకు భూమి పూజ**

తదుపరి పెద్ద గుల్ల గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.






# అక్షరాలకు వీడ్కోలు.. ఉన్నత శిఖరాలకు స్వాగతం!

- పొన్కల్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక
- తెలంగాణ రైజింగ్ ఉత్సవాలతో పాటు వందేమాతరం గీతానికి నూట యాభై ఏళ్లు

**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

జన్నారం మండలం పొన్కల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రెండు వేల ఇరవై ఐదు - ఇరవై ఆరు విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం కనులపండువగా సాగింది. తెలంగాణ రైజింగ్ ఉత్సవాలతో పాటు వందేమాతరం గీతానికి నూట యాభై ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ వేడుకను ఒక పండుగలా నిర్వహించారు. పాఠశాల అంటే కేవలం చదువు మాత్రమే కాదని అదొక మధుర జ్ఞాపకమని విద్యార్థులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

**క్రమశిక్షణే విజయానికి తొలి మెట్టు**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ సుష్మ భూమేష్ విద్యార్థులను ఆశీర్వదించారు. ప్రాథమిక విద్యను పూర్తి చేసుకుని హైస్కూల్ మెట్లు ఎక్కుతున్న తరుణంలో విద్యార్థులు క్రమశిక్షణను అలవరచుకోవాలని సూచించారు. గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. మండల విద్యాధికారి విజయ్ కుమార్ పాల్గొని విద్యార్థుల ప్రతిభను అభినందించారు. స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం విద్యాభివృద్ధికి కట్టుబడి ఉందని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి పాఠశాల సాధించిన విజయాలను, అభివృద్ధిని వివరించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు పడుతున్న శ్రమను ఆమె గుర్తు చేస్తూ పాఠశాల ప్రగతిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారుల ఆటపాటలు, ఉపాధ్యాయుల సందేశాలతో పాఠశాల ప్రాంగణం అంతా భావోద్వేగాల మధ్య సందడిగా మారింది. ఈ వేడుకలో విద్యాశాఖతో పాటు అంగన్‌వాడీ సిబ్బంది చురుగ్గా పాల్గొన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది జయమణి, మండల వనరుల కేంద్రం సిబ్బంది వెంకటేష్, క్లస్టర్ వనరుల వ్యక్తులు శేఖర్, దయాకర్ హాజరయ్యారు. వీరితో పాటు బుచ్చన్న, అజీజోద్దీన్, విజయ్, ఇతర ఉపాధ్యాయ బృందం ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను దీవించారు.

# ఆసిఫాబాద్ పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**తొమ్మిదో వార్డులో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక పనుల పర్యవేక్షణ**

**మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ వెల్లడి**



**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

ఆసిఫాబాద్ జిల్లా పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం తొమ్మిదో వార్డులో అత్యంత ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ కౌన్సిలర్లతో కలిసి పారిశుద్ధ్య పనులను స్వయంగా పర్యవేక్షించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుంటూనే పరిసరాల పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు.

**ప్రజా ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యత**

పట్టణ అభివృద్ధి, ప్రజా ఆరోగ్యమే తమ ప్రథమ ప్రాధాన్యత అని మున్సిపల్ చైర్మన్ పేర్కొన్నారు. కేవలం అధికారుల వల్ల మాత్రమే మార్పు రాదని, ప్రజలు కూడా బాధ్యతగా తడి, పొడి చెత్తను వేరు చేయడం అలవాటు చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ ఇంట్లోనే ఎరువు తయారీ విధానాన్ని అనుసరిస్తే చెత్త సమస్యను సమర్థవంతంగా పరిష్కరించవచ్చని సూచించారు. కుండీలు, కూలర్లలో నిల్వ ఉన్న నీటిని వెంటనే తొలగించి రోగాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని హితవు పలికారు.

**ప్లాస్టిక్ రహిత పట్టణం దిశగా అడుగులు**

ప్లాస్టిక్ రహిత ఆసిఫాబాద్ లక్ష్యంలో భాగంగా వ్యాపారులు, హోటల్ నిర్వాహకులు ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ వాడకాన్ని తక్షణమే మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించి వీధులను శుభ్రపరిచారు. దోమల నివారణకు మందు స్ప్రే చేయించడంతో పాటు మంచినీటి ట్యాంకర్లను శుభ్రం చేయించి సురక్షితమైన నీరు అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చిలువేరు వెంకన్న, సాలం బిన్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ గజనంద్, అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# బస్వాపూర్ అంగన్వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు

**గర్భిణీలకు పోషకాహారంపై ప్రత్యేక అవగాహన**

**ఆరోగ్య లక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచన**

**కోహెడ, మార్చి 13 (జనం పవర్):**

సిద్ధిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీలకు, బాలింతలకు పోషకాహారాన్ని పెంపొందించేందుకు సామూహిక సీమంతం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు రేణుక, విజయ లలిత, శ్రీలత గర్భిణీలకు పసుపు, కుంకుమ, గాజులు బహుకరించి సంప్రదాయ పద్ధతిలో వేడుక నిర్వహించారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ వారికి గుడ్లు, పాలు, స్వీట్లు వంటి పౌష్టికాహారాన్ని అందజేశారు.

**ఆరోగ్య లక్ష్మి పథకం సేవలు**

అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన ఈ వేడుక ద్వారా గర్భిణీలకు అవసరమైన పౌష్టికాహారం గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య లక్ష్మి పథకం సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలకు అవసరమైన కౌన్సెలింగ్ తో పాటు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సమాజంలో గర్భిణీల పట్ల బాధ్యతను పెంచడం, వారిని సంతోషపెట్టడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని అంగన్వాడీ సిబ్బంది తెలిపారు. సాంప్రదాయకమైన పద్ధతిలో జరిగిన ఈ సీమంతం వేడుకలో ఏఎన్ఎంలు లక్ష్మి, అనిత పాల్గొన్నారు. వీరితో పాటు ఉప సర్పంచ్ ప్రవీణ్ గౌడ్, వార్డు సభ్యులు బండి సంపత్, పుల్లూరి నవీన్, మోతుకుల రంజిత్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, గర్భిణీలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వేడుక అనంతరం గర్భిణీలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ కార్యక్రమాన్ని ముగించారు.





# విద్యార్థులకు అండగా మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా, క్రీడా సామగ్రి పంపిణీ

**సంగారెడ్డి, మార్చి 13 (జనం పవర్):**
పటాన్‌చెరు మండల పరిధిలోని పోచారం ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు విద్యా, క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పార్కర్ హనీ ఫిన్ ఇండియా సంస్థ సహకారంతో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పేద విద్యార్థులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, బెల్ట్, టై, షూస్, కంపాస్ బాక్స్, పెన్, పెన్సిళ్లు, అలాగే లైబ్రరీ పుస్తకాలు అందజేశారు. అదనంగా విద్యార్థుల కోసం విద్యా కిట్లు, క్రీడా సామగ్రి, ప్లే జోన్ ఫర్నిచర్ కూడా ఏర్పాటు చేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించేలా ప్రోత్సహించడానికి ఈ సామగ్రి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

### ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

ఈ కార్యక్రమంలో మెడ్వాన్ డైరెక్టర్ హెచ్. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం తమ ముఖ్య లక్ష్యమని తెలిపారు. గ్రామంలోని పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకోవాలని, విద్యార్థుల సంఖ్య పెరగాలని ఆశిస్తున్నామని అన్నారు. గత ఐదేళ్లుగా ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ విధమైన సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని, అందరి సహకారంతో పాఠశాలలో మంచి మార్పులు వచ్చాయని తెలిపారు.

### స్వచ్ఛంద సంస్థ సేవలు అమోఘం

పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని అన్నారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి అందించడం ద్వారా పాఠశాల అభివృద్ధికి సంస్థ ఎంతో తోడ్పడుతోందని తెలిపారు. పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల తరఫున మెడ్వాన్ డైరెక్టర్ హెచ్. మధుసూదన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, కోఆర్డినేటర్లు హఫీజ్, ఆమదాయ్య తదితరులు పాల్గొన్నారు.

# పది విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో మెరవాలి

- విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- కన్నవారి కలలు నెరవేర్చి ఉజ్వల భవిష్యత్తు అందుకోవాలని ఆకాంక్ష



**కోహెడ, మార్చి 13 (జనం పవర్):**
కన్నవారి కలలను నెరవేర్చేందుకు.. ఉజ్వల భవిష్యత్తును అందుకునేందుకు పదవ తరగతి విద్యార్థులు ఈనెల 14వ తేదీ నుంచి జరిగే పరీక్షలను బాగా రాసి ఉత్తీర్ణులు కావాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పరీక్ష రాయనున్న 5,17,727 మంది విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. పరీక్ష కేంద్రాలకు నిర్ణీత సమయానికన్నా అరగంట ముందే కచ్చితంగా చేరుకోవాలని సూచించారు.

### పేద విద్యార్థులకు అండగా నిలిచాం

ముఖ్యంగా తన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో పరీక్ష రాయనున్న విద్యార్థులందరికీ ముందస్తు అభినందనలు తెలిపారు. చదువుపై ఆసక్తి ఉన్న దాదాపు 20 వేల మంది పేద విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. దీనివల్ల విద్యార్థులు సకాలంలో పాఠశాలలకు వెళ్లే అవకాశం దక్కిందని చెప్పారు. అలాగే పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజును తానే స్వయంగా చెల్లించి తల్లిదండ్రులపై కొంత ఆర్థిక భారం తగ్గించినట్లు పేర్కొన్నారు.

### ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

పరీక్షల సమయంలో అనవసరమైన ఆందోళన, ఒత్తిడికి గురికావద్దని విద్యార్థులకు హితవు పలికారు. ఇన్నాళ్లు శ్రద్ధతో చదివిన అంశాలను పునశ్చరణ చేసుకొని ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. గతేడాది ఫలితాల్లో కరీంనగర్ ఆరో స్థానంలో, సిరిసిల్ల ఐదో స్థానంలో నిలిచాయని.. ఈసారి ఈ రెండు జిల్లాలు మొదటి రెండు స్థానాల్లో నిలిచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నమ్మకాన్ని నిలబెట్టాలని ఆకాంక్షించారు.

### అధికారులకు ప్రత్యేక సూచనలు

జిల్లాల కలెక్టర్లు, అధికారులు, పోలీసులు విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రవాణా, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ నెల 14వ తేదీన తాను చేపట్టే కొండగట్టు అంజన్న పాదయాత్ర వల్ల విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాయకులను సమాయత్తం చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో ఫ్యాన్లు, మంచినీటి వసతి కల్పించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను క్షేమంగా కేంద్రాలకు తీసుకెళ్లి తీసుకురావాలని సూచిస్తూ శత శాతం ఫలితాలు రావాలని ఆశీర్వదించారు.

# సంగారెడ్డిలో ఘనంగా మొల్ల మాంబ జయంతి

- ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కుమ్మరి సంఘం డిమాండ్
- విగ్రహం కోసం స్థలం కేటాయించాలని కలెక్టరుకు విన్నపం



**సంగారెడ్డి, మార్చి 13 (జనం పవర్):**
సంగారెడ్డి పట్టణంలోని ఐబీ వద్ద కుమ్మరి కుల బంధువులు కలిసి తెలుగు సాహిత్య చరిత్రలో విశిష్ట స్థానం కలిగిన మొల్ల మాంబ గారి ఐదు వందల ఎనభై ఆరో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా, రాష్ట్ర, మండల స్థాయి కుమ్మరి సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలుగు సాహిత్యంలో ప్రఖ్యాతి గాంచిన మొల్ల రామాయణం రచయిత్రిగా ప్రసిద్ధి చెందిన మొల్ల మాంబ, సంస్కృతంలోని రామాయణాన్ని సులభమైన తెలుగులోకి అనువదించిన తొలి తెలుగు మహిళగా గుర్తింపు పొందారు. ఆమె తమ కుమ్మరి కులంలో పుట్టినందుకు తామంతా గర్వపడుతున్నామని కుమ్మరి నాయకులు పేర్కొన్నారు.

### అధికారిక వేడుకగా ప్రకటించాలి

మొల్ల మాంబ వంటి మహనీయురాలి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కుమ్మరి నాయకులు డిమాండ్ చేశారు. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ లో ఈ వేడుకలను ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లే తెలంగాణలో కూడా అధికారికంగా జరపాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సంగారెడ్డిలో మొల్ల మాంబ విగ్రహం ప్రతిష్టించేందుకు తగిన స్థలం కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను కుమ్మరి కుల బంధువులు కోరారు. ఆమె సాహిత్య సేవలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సతీష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు. మహిళా ప్రతినిధులు మంగ, వరలక్ష్మి, లావణ్య, మేఘన, తేజస్విని హాజరయ్యారు. వీరితో పాటు సాయిలు, రమేష్, అంజయ్య, దర్శన్, శ్రీశైలం, శంకర్, శ్రీహరి, మల్లేశం, ప్రకాష్, శ్రీను, మహేష్, ముకేశ్, రవి, త్రివిక్రమ్ రావు, ఆంజనేయులు, సంగమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొని మొల్ల మాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

### విద్యార్థులకు అండగా జిల్లా కాంగ్రెస్ నాయకుడు అన్నాడి జీవన్ రెడ్డి

### వింజపల్లి నుండి కోహెడకు ఉచిత రవాణా సౌకర్యం



**కోహెడ, మార్చి 13 (జనం పవర్):**
కోహెడ మండలం వింజపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ అన్నాడి జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో పెన్నులు, పెన్సిళ్లు, ప్యాడ్లను పంపిణీ చేశారు. శనివారం నుండి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఈ సామగ్రిని అందజేసి మనోధైర్యాన్ని కల్పించారు.

### విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం

పరీక్షా సమయంలో విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవడానికి వింజపల్లి నుండి కోహెడ మండలం వరకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తామని సర్పంచ్ అన్నాడి శ్రీజ-జీవన్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, తద్వారా పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు కూడా హాజరై విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ఈ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు కోరారు.

# పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

### నేటి నుండి ప్రారంభం కానున్న వార్షిక పరీక్షలు

### కేంద్రాల వద్ద అన్ని వసతులు సిద్ధం చేసిన అధికారులు



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**
సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా శనివారం నుండి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. నిబంధనల ప్రకారం పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన కనీస వసతులపై ప్రత్యేక దృష్టి సారించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు తమకు కేటాయించిన స్థానాలను సులభంగా గుర్తించేందుకు వీలుగా తరగతి గదుల్లోని బెంచీలపై హాల్ టికెట్ నంబర్లు వేసే ప్రక్రియను ఉపాధ్యాయులు పూర్తి చేశారు. విద్యార్థులు ఎక్కడా ఇబ్బంది పడకుండా క్రమపద్ధతిలో కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఫ్యాన్ల మరమ్మతులు కూడా చేయించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు ఎప్పటికప్పుడు కేంద్రాలను పర్యవేక్షిస్తూ విద్యార్థులు నిర్ణీత సమయానికే పరీక్షా హాల్ కు చేరుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ విద్యార్థులు ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలని ఉపాధ్యాయ బృందం కోరింది.



# గ్రామస్తులపై తేనెటీగల మెరుపు దాడి

### వెంకటాపురంలో ప్రజల హాహాకారాలు.. ఇళ్లలోకి పరుగులు

### పలువురికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

**సంగారెడ్డి, మార్చి 13 (జనం పవర్):**
సదాశివపేట మండలం వెంకటాపురం గ్రామంలో తేనెటీగలు ఒక్కసారిగా గ్రామంలోకి దూసుకువచ్చి రోడ్డుపై వెళ్తున్న గ్రామస్తులపై దాడి చేశాయి. దీంతో అక్కడ తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఎటు చూసినా తేనెటీగల గుంపులు గ్రామంలో తిరుగుతుండటంతో ప్రజలు, పాఠశాల పిల్లలు ప్రాణాలు కాపాడుకోవడానికి ఇళ్లలోకి పరుగులు పెట్టారు. ఒక్కసారిగా మొదలైన ఈ దాడి వల్ల గ్రామంలో గందరగోళం ఏర్పడింది.

### ఆస్పత్రులకు తరలింపు

ఈ దాడిలో పలువురు గ్రామస్తులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే నూట ఎనిమిది వాహనం సహాయంతో సమీప ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. అయితే బాధితుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఒకే వాహనం సరిపోలేదు. దీంతో కొందరు బాధితులు స్వయంగా తమ సొంత వాహనాల్లో ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం బాధితులకు వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు.

### ఆరోగ్య సమస్యలపై ఆందోళన

తేనెటీగల కాటు వల్ల బాధితులకు తీవ్రమైన నొప్పి, వాపు, చర్మం ఎర్రబారడం వంటి ఇబ్బందులు కనిపిస్తున్నాయి. కొందరికి అలర్జీ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఒకేసారి ఎక్కువ సంఖ్యలో తేనెటీగలు కుట్టినప్పుడు శరీరంలో విష ప్రభావం పెరుగుతుందని హెచ్చరించారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తలనొప్పి, వాంతులు, తీవ్రమైన వాపు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

### భయాందోళనలో గ్రామస్తులు

ఈ ఘటనతో వెంకటాపురం గ్రామంలో భయం నెలకొంది. ఇంకా తేనెటీగల గుంపులు తిరుగుతుండటంతో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. గ్రామ పరిసరాల్లో ఉన్న తేనెటీగల గూళ్లను గుర్తించి వెంటనే తొలగించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. ప్రజల భద్రత కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు. ఇలాంటి ప్రమాదాలు మళ్ళీ జరగకుండా గ్రామీణ ప్రాంతాల్లో తేనెటీగల గూళ్ల నిర్వహణపై అధికారులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



# పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

**విద్యార్థులకు అండగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కుశాల్**

**మంచి మార్కులు సాధించి పాఠశాలకు పేరు తేవాలని పిలుపు**




**బిచ్కుంద, మార్చి 13 (జనం పవర్):**

కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలోని పుల్కల్ గ్రామంలో పదవ తరగతి చదువుతున్న అరవై మంది విద్యార్థులకు శుక్రవారం విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కుశాల్ పరీక్షా సామాగ్రిని అందజేశారు. రేపటి నుండి ప్రారంభం కానున్న పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన ప్యాడ్లు, పెన్నులు, కంపాస్ బాక్సులను ఆయన స్వయంగా పంపిణీ చేశారు. తమ పాఠశాల పట్ల ఉన్న మక్కువతో ఆయన చేసిన ఈ సాయం విద్యార్థులకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చింది. ఈ సందర్భంగా కుశాల్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు గొప్ప పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎలాంటి భయం లేకుండా పరీక్షలు బాగా రాయాలని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు ఆనంద్ మాట్లాడుతూ విరామ జీవితంలోనూ పిల్లలను మర్చిపోకుండా సామాగ్రి అందించినందుకు కుశాల్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# స్వంత ఖర్చులతో విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

**పదో తరగతి విద్యార్థులకు అండగా నిలిచిన యువకుడు మహేశ్**

**అత్యధిక మార్కులు సాధిస్తే నగదు బహుమతి ఇస్తానని వెల్లడి**



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

నంగునూరు మండలం మగ్దుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు రాంపూర్ గ్రామానికి చెందిన ముద్రబోయిన మహేశ్ తన స్వంత ఖర్చులతో పరీక్షా సామాగ్రిని అందజేశారు. సిద్దిపేటలో వాహనం నడుపుతూ జీవనం సాగిస్తున్న మహేశ్, తన కష్టార్జితం నుండి 24 మంది విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు పంపిణీ చేసి ఉదారత చాటుకున్నారు. పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు సురేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహేశ్ మాట్లాడుతూ.. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు వెయ్యి రూపాయల నగదు బహుమతి ఇస్తానని ప్రకటించారు. ఉప సర్పంచి బొడిగె తిరుపతి కూడా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొని మహేశ్ సేవలను అభినందించారు.

# డీఈఈటీ ఉ మహీంద్రా - మహీంద్రా జాబ్ డ్రైవ్ విజయవంతం

**డెబ్బై ఎనిమిది మంది అభ్యర్థులకు నియామక పత్రాల అందజేత**

**నిరుద్యోగ యువతకు అండగా నిలిచిన ప్రజా పాలన కార్యక్రమం**

**సంగారెడ్డి, మార్చి 13 (జనం పవర్):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన తొంభై తొమ్మిది రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తెలంగాణ డిజిటల్ ఉపాధి వేదిక (డీఈఈటీ) ఆధ్వర్యంలో నిర్వహించిన మహీంద్రా – మహీంద్రా ట్రాక్టర్ల మెగా జాబ్ డ్రైవ్ విజయవంతంగా జరిగింది. సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఈ జాబ్ డ్రైవ్ ద్వారా జహీరాబాద్‌లోని మహీంద్రా – మహీంద్రా ప్లాంట్‌లో ఎనిమిది వందలకు పైగా ఉద్యోగాల భర్తీ లక్ష్యంగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. మార్చి 13న ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు జరిగిన ఈ జాబ్ డ్రైవ్‌కు యువత నుంచి మంచి స్పందన లభించింది. మొత్తం ఏడు వందల యాభై ఆరు మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, మొదటి దశ టెలిఫోన్ ఇంటర్వ్యూలో రెండు వందల తొంభై ఐదు మంది ఎంపికయ్యారు. వారిలో నూట ఇరవై ఐదు మంది ప్రత్యక్షంగా జాబ్ డ్రైవ్‌కు హాజరయ్యారు. చివరగా డెబ్బై ఎనిమిది మంది అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు లభించగా వారికి నియామక పత్రాలు అందజేశారు.



**సాంకేతిక విభాగాల్లో కొలువులు**

ఈ జాబ్ డ్రైవ్‌లో ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా అర్హత కలిగిన అభ్యర్థులకు అవకాశాలు కల్పించారు. ముఖ్యంగా మెషినింగ్, ఫిట్టర్, ఎలక్ట్రిషియన్, వెల్డర్ వంటి సాంకేతిక విభాగాలతో పాటు క్వాలిటీ, లైన్ సపోర్ట్ విభాగాల్లో ఉద్యోగాల కోసం ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు జహీరాబాద్ ప్లాంట్‌లో తక్షణమే విధుల్లో చేరే అవకాశం కల్పించినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

**యువతకు ప్రజా ప్రతినిధుల పిలుపు**

ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని ప్రారంభించారు. సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్‌కుమార్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ తుల్జ నాయక్ పాల్గొన్నారు. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఐఐసీ) చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ఎంపికైన అభ్యర్థులను అభినందించారు. రాబోయే రోజుల్లో సదాశివపేట, జహీరాబాద్, సంగారెడ్డి ప్రాంతాల్లో నిర్వహించనున్న జాబ్ డ్రైవ్‌లలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు.

# అత్యవసర సంస్థలకు గ్యాస్ కొరత రాకుండా చూడాలి

- గ్యాస్ డీలర్లకు జిల్లా కలెక్టర్ కె. హైమవతి ఆదేశం
- వసతి గృహాలు, పాఠశాలలకు నిరంతరం సరఫరా జరగాలి

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

గృహావసరాలతో పాటు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలకు ఎలాంటి కొరత లేకుండా వంట గ్యాస్ సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమవతి గ్యాస్ డీలర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గ్యాస్ డీలర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటివరకు జిల్లాలో గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా గ్యాస్ సరఫరా కొనసాగించాలని సూచించారు.




**ప్రభుత్వ ప్రాధాన్యత సంస్థలకు గ్యాస్ సరఫరా**

యుద్ధ వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇతర దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకుని సరఫరా చేస్తోందని కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వ ప్రాధాన్యత గల గురుకుల విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు ముందుగా గ్యాస్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే గృహ వినియోగదారులకు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా గ్యాస్ అందించాలని కోరారు.

**స్టాక్ రిజిస్టర్లు కచ్చితంగా ఉండాలి**

గ్యాస్ పంపిణీ సమయానికి జరిగేలా సిబ్బందిని పర్యవేక్షించాలని, నిల్వలు, పంపిణీ రిజిస్టర్లను కచ్చితంగా నిర్వహించాలని సూచించారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే జిల్లా పౌరసరఫరాల అధికారి దృష్టికి తీసుకురావాలని చెప్పారు. గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఒక సిలిండర్ తేడా వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ, పౌరసరఫరాలు, విజిలెన్స్ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి తనుజ, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ పాల్గొన్నారు. వీరితో పాటు మహిళా సంక్షేమ శాఖ అధికారి శారద, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, రవాణా శాఖల అధికారులు హాజరయ్యారు.

# చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

- బద్దిపడగ పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం
- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని దేశిరెడ్డి పిలుపు

**నంగునూరు, మార్చి 13 (జనం పవర్):**

విద్యార్థులు చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని వాటిని సాధించడానికి కృషి చేయాలని నంగునూరు మండల విద్యాధికారి దేశిరెడ్డి సూచించారు. బద్దిపడగ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన స్వయం పరిపాలన దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. రాజేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దేశిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో ప్రాథమిక దశ ఎంతో కీలకమని తెలిపారు.

**ప్రాథమిక దశే పునాది**

ఈ దశలోనే చదువు, క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకొని సత్ప్రవర్తన అలవర్చుకోవాలని దేశిరెడ్డి పేర్కొన్నారు. క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్ రెడ్డి



మాట్లాడుతూ స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రలో పాఠాలు బోధించడం ఎంతో ప్రశంసనీయమని చెప్పారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో ఎదగాలని ఆకాంక్షించారు.

**గురువుల పాత్రలో విద్యార్థులు**

ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తమ అనుభవాలను పంచుకున్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంత కష్టసాధ్యమో తమకు అర్థమైందని విద్యార్థులు తెలిపారు. బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తెస్తామని ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు హాజరైన వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రకాంత్, శ్రీనివాస్, మంగ, రవళి, అఖిల పాల్గొన్నారు. వీరితో పాటు తల్లిదండ్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై విద్యార్థుల ప్రతిభను అభినందించారు. పాఠశాల ప్రాంగణం అంతా విద్యార్థుల సందడితో కళకళలాడింది.

# మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశం
- మంచిర్యాల జిల్లాలో 61.6 శాతం మ్యాపింగ్ పూర్తి

**వేల్పుల నగేష్ -జనం పవర్ -ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా మ్యాపింగ్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి తిరిగి మ్యాపింగ్ పూర్తి చేసేలా చూడాలని, ఇందుకు గ్రామ పాలన అధికారులు సహకరించాలని సూచించారు.

**రాజకీయ పార్టీల సమన్వయం**

రాజకీయ పార్టీల నుండి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించేలా అవగాహన కల్పించాలని ఎన్నికల అధికారి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పర్యవేక్షకులు సహాయ సహకారాలు




అందించాలని పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కోరారు. ప్రజలకు బూత్ స్థాయి అధికారుల వివరాలు తెలిసేలా ప్రచారం చేయాలని ఆదేశించారు.

**లక్ష్యం దిశగా మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 61.6 శాతం మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం డూప్లికేట్ ఓట్ల తొలగింపు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధికారుల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, శ్రీనివాస్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**రామసాగర్ సర్పంచ్ ఇంగాల లక్ష్మి పిలుపు**

**ఇంటింటికీ తిరిగి 'డ్రై డే' పై గ్రామస్థులకు అవగాహన**



**బెజ్జంకి, మార్చి 13 (జనం పవర్):**

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే మనం ఆరోగ్యంగా ఉండగలుగుతామని రామసాగర్ సర్పంచ్ ఇంగాల లక్ష్మి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇంటింటికీ తిరుగుతూ డ్రై డే గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆమె ప్రజలను ఈ సందర్భంగా హెచ్చరించారు. గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించి ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా మార్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అడుకని వీరేశం, పంచాయతీ కార్యదర్శి సురేష్, వార్డు సభ్యులు సంజీవరావు, కేశవ్ హాజరయ్యారు. వీరితో పాటు హరిత, లోహిత, లావణ్యలతో పాటు గ్రామ ప్రజలు పాల్గొని గ్రామాన్ని స్వచ్ఛంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు.



## రంజాన్ తోఫా పంపిణీ

**హాజీపూర్ లో కానుకలు అందజేసిన కొక్కిరాల సురేఖ**

**కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమం**

**హాజీపూర్, మార్చి 13 (జనం పవర్):**

మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో హాజీపూర్ బస్టాండ్ వద్ద రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం జరిగింది. కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ముస్లిం సోదరీమణులకు జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు రంజాన్ కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా సురేఖమ్మ మాట్లాడుతూ ముస్లిం సోదరీమణులకు రంజాన్ పండుగ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. పేద కుటుంబాల్లో పండుగ సంతోషం నింపాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

